క్లుప్తంగా

రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో సోమవారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృషించింది. పలు కాలనీలు, రోడ్లు నీట మునిగాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఊరుమందమర్రికి వెళ్లే రోడ్డుపై ఓ వృక్షం పడిపోవడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడగా, విద్యుత్ సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆటో టాప్ నంబర్ల విడుదల



ఆటోలకు టాప్ నంబర్లను వేస్తున్న సీఐ

మంచిర్యాలటౌన్: ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు తూముల నరేశ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ సీఐ ప్రమోద్‌రావుతో కలిసి బస్టాండ్ ఆటో పాయింట్ వద్ద ఆటో నంబర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బచ్చలి మల్లేశ్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అంకతి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సుద్దాల రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం మాట్లాడుతూ.. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదేశాలతో మంచిర్యాల నగరంలో నెలకొన్న పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, తోట తిరుపతి, తాజుద్దీన్, ఎర్రం తిరుపతి, ఎడ్ల కిషన్, వంగ తిరుపతి, జూపాక సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రత్యేక వైద్యులు

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సోమవారం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మహిళల్లో కలిగే అనారోగ్య సమస్యలు వాటి నివారణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు సతీష్, క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాల్లో ప్రత్యేక వైద్య నిపుణలు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని చింతలపల్లిలో జన్నారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రజలకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రషీద్ ఖాన్, ఏఎన్ఎం సంధ్య, ఆశ కార్యకర్త వనిత పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఎంపీడీవో ఆఫీస్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రమేశ్, డాక్టర్ శరత్, సిబ్బంది సంధ్యారాణి, కవిత, ఆశ వర్కర్లు రాధ, రూప తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలక్రైం: అటవీ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలల నుంచి జీతాలు రావడం లేదని, వెంటనే జీతాలు జమ చేయాలని సోమవారం ఎఫ్‌డీపీటీ శాంతారాంను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆరు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వెంకటస్వామి, ముజాయిద్‌ఖాన్, మహేందర్, రమేష్‌బాబు, అయుబ్, విజయ్‌కుమార్, మధూకర్ పాల్గొన్నారు.

కూలిన లోలెవల్ వంతెన



చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలోని వాగుపై లోలెవల్ వంతెన పూర్తిగా కూలింది. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచాయి. దీంతో అటుగా వెళ్లే ఆయా గ్రామాల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



భీమారం: మండల కేంద్రం నుంచి కొత్తపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆరెపల్లి సమీపంలో రోడ్డుపై పెద్ద బుంగ ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదం పొంచి ఉంది. బుంగ ఉందని తెలిసేలా అటుగా వెళ్లే వాహనదారులు అందులో ఎర్రటిటవల్ పెట్టారు. ఏ ప్రమాదం జరగముందే సంబంధిత అధికారులు స్పందించి బుంగను పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

పశువులతో ప్రమాదం



జన్నారం: జన్నారంలోని ప్రధాన రహదారిపై పశువులు తిష్టవేస్తున్నాయి. దీంతో రాత్రివేళ రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైన అధికారులు పట్టించుకుని పశువులను రోడ్లపై రాకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఆదాయం ఉన్నా.. అదే నిర్లక్ష్యం

- అభివృద్ధికి నోచుకోని చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్
- అపరిశుభ్రతకు నిలయంగా పరిసరాలు
- లైట్లు లేక రాత్రిపూట చిమ్మచీకట్లు
- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల తిప్పలు



అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

చెన్నూర్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. నియోజకవర్గ కేంద్రంలో గల ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి 40ఏళ్లకు పైగా కావస్తున్నా, నేటికీ బస్టాండ్ భవనానికి సున్నం వేసిన దాఖలాలు లేవు. భవనం శిథిలావస్థకు చేరింది. పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా బస్టాండ్ ప్రాంగణ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఆదాయంలో ఘనం..

జిల్లాలోనే చెన్నూర్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నుంచి రాకపోకలు సాగించే రూట్ల నుంచే మంచిర్యాల డిపోకు అత్యధిక ఆదాయం సమకూరుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రధాన దారిలో సిమెంట్ రోడ్డు తప్పా, ప్రాంగణ పరిసరాలను పట్టించుకునే వారే కరువయ్యారు. చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి చెన్నూర్–మంచిర్యాలతో పాటు హైదరాబాద్, పరకాల, ఆదిలాబాద్, కాటారం, వరంగల్, ఆసిఫాబాద్, సిరోంచ, గడిచిరోలి, కాళేశ్వరం, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు ఆర్టీసీ బస్సుల్లో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. తాగునీటి ట్యాంక్ పనిచేయడం లేదు. ఫ్యాన్లు లేవు, లైట్లు లేవు, రాత్రి అయితే ప్రాంగణం వెలుప తప్పా లోపల ఒక్క లైటు లేకపోవడంతో అంధకారంగా మారుతోంది.



పనిచేయని తాగునీటి ట్యాంక్

పరిసరాలు కంపు కొడుతున్న..

ప్రయాణ ప్రాంగణ పరిసరాలు అధ్వానంగా మారాయి. గుంతల్లో నీరు నిలువడంతో పాటు సులభ్ కాంప్లెక్స్‌ల నుంచి నీరు బయటికి రావడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ భవనం వెనుక బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయడంతో పాటు చెత్త చెదారంతో నిండిపోయింది.

రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలపాలు..

ఆర్టీసీ ప్రాంగణంలో లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ భవన వెనుక ప్రాంతంలో చీకటిగా ఉండడంతో మందుబాబులు వీరవిహారం చేస్తున్నారని ప్రయాణికులు తెలిపారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్టాండ్‌లో పడుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

చెన్నూర్ రూట్లలో ఆర్టీసీ ఆదాయ వివరాలు..

చెన్నూర్ రూట్లలో 12ఆర్టీసీ సర్వీసులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయి. సుమారు రూ.4వేల కిలో మీటర్లు. రోజు వారి ఆదాయం మహాలక్ష్మీ స్కీంతో కలిసి సుమారు ఆదాయం రూ.2.05లక్షలు, నెలకు రూ.60లక్షలు, ఏడాదికి రూ.7.10కోట్లు ఉంటుంది.

అధ్వానంగా బస్టాండ్..



ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా మారింది. బస్సులు రాకపోకలు సాగించే రోడ్డు తప్పా చుట్టుపక్కల అపరిశుభ్రంగా మారింది. బహిరంగ మూత్ర విసర్జన, గుంతల్లో నీరు నిలిచి కంపు కొడుతుంది. చెన్నూర్ నుంచి ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా అభివృద్ధి మాత్రం చేయడం లేదు. కనీసం తాగేందుకు నీరు లేదు. బస్టాండ్ లోపల లైట్లు లేక రాత్రి చీకట్లో ఉండాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

– పున్నం సతీశ్, ప్రయాణికుడు

పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం..

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పనులు చేపట్టేందుకు సివిల్ డిపార్టుమెంట్ డీఈకి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. పరిసరాలు పరిశుభ్రం చేయిస్తాం.

– శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

బతుకమ్మ సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

జన్నారం: మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో నిర్మించిన బంగారు బతుకమ్మ పాటను సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మల వద్ద డీజేలతో నృత్యాలు చేసే సంస్కృతిని రూపుమాపి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని అద్దం పట్టేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ పాటను నిర్మించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల నృత్యం చాలా బాగుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ సతీశ్ గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి గౌడ్, ట్రస్మా రాష్ట్ర నాయకుడు షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాలి



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న శ్రీకాంత్

భీమారం: మండల కేంద్రంలోని ఫోర్‌లైన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలగడంలేదని బీఆర్ఎస్ నియోజకవర్గం యూత్ కమిటీ అధ్యక్షుడు వేముల శ్రీకాంత్ గౌడ్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో లైట్లు బిగించినా అవి వెలుగడంలేదని వివరించారు.

సమాచారం

25న బతుకమ్మ సంబరాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా రెడ్డి మహిళామణుల ఆధ్వర్యంలో ఈ నెల 25న సాయంత్రం 5గంటల నుంచి శ్రీనివాస గార్డెన్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్డి మహిళా అధ్యక్షురాలు గోనె మణిమాల రెడ్డి తెలిపారు. బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధారాణి రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

భీమిని: కన్నెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లో మరమ్మతులు ఉన్నందునా మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భీమిని, జన్కాపూర్, కన్నెపల్లి, నాయకనిపేట, నెన్నెల, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని డీఈ రాజన్న, ఏఈ రాజనర్సు కోరారు.

25న పట్టుబడిన బైక్‌లకు వేలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన బైక్‌లకు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 21ద్విచక్ర వాహనాలు పట్టుబడగా వీటన్నింటికీ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు బెల్లంపల్లి ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహిస్తామని ఆసక్తి కలిగిన వ్యక్తులు వాహన విలువలో 50శాతం ఈఎండీ ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సమాచారం కోసం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

28న జిల్లా మహాసభ

బెల్లంపల్లి: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా మూడో మహాసభను ఈ నెల 28న బెల్లంపల్లిలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ బెల్లంపల్లి మండల కార్యదర్శి సీ.హెచ్.దేవదాస్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10–30 గంటలకు బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మహాసభ ప్రారంభమవుతుందని ప్రకటించారు. మున్సిపల్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శివ భగత్, చంద్రశేఖర్, రవి, సింగయ్య, రాజేష్, కమల్, ప్రభాకర్, యాకూబ్, చంద్రమొగిలి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వూషూ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: నస్పూర్ శ్రీ సాధన పాఠశాలలో ఎస్‌జీఎఫ్–అండర్–17విభాగం వూషూ బాలబాలికల జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకుబ్ తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు, తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

రైల్వే పాఠశాల టీచర్‌కు గురుబ్రహ్మ అవార్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వే ఈపీఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ యూసుఫ్‌కు గురుబ్రహ్మ అవార్డు వరించింది. ఇటీవల మంచిర్యాల గార్డెన్స్ వెంపల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం చేశారు.

‘ఆదివాసీ మనుగడ దెబ్బతీస్తున్న ప్రభుత్వాలు’

కాసిపేట: ఆదివాసీల మనుగడను ప్రభుత్వాలు దెబ్బ తీస్తున్నాయని, అమరుల స్ఫూర్తితో ఆదివాసీల సమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి పిలుపునిచ్చారు. మండలంలోని తిరుమలపూర్‌లో ఇటీవల మరణించిన సీపీఎం నాయకుడు టేకం శంకర్ సంతాపసభకు సోమవారం ముఖ్య అతిథులుగా హాజరై సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో టేకం శ్రీనివాస్, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కనికరం అశోక్, రజక సంఘం నాయకులు పాయిరాల రాములు పాల్గొన్నారు.

పకడ్బందీగా బయో వ్యర్థాల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



పోసర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బయో వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బయో వ్యర్థాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాల కోసం వేర్వేరు బకెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలితో సమన్వయంతో చేసుకోవాలని, లేనిపక్షంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో వ్యర్థాలు పడవేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కార్యక్రమ సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కృపాబాయి, ప్రభుత్వ పర్యవేక్షకులు హరిశ్చంద్రరెడ్డి, నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ సమన్వయకర్త రంజిత్ కుమార్, వెంకటరమణ, కరీంనగర్ సమన్వయకర్త తిరుపతి, ఐఎంఏ వైద్యులు సాల్మన్ రాజు, రవిప్రసాద్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఖాదీ వస్త్రాలు ధరించాలి

- శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: చేనేతను ఆదుకోవడం కోసం ఖాదీ వస్త్రాలను ధరించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన వావిలాల ఖాదీ గ్రామోద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఉద్యోగులు ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయడం కోసం వీలుగా రూ.20,000 క్రెడిట్ అందిస్తున్నామన్నారు. ఉద్యోగులు వారి గుర్తింపు కార్డు, జీతం చిట్టి తీసుకొని ఇక్కడ వస్త్రాలను కొనుగోలు చేస్తే ఆ మొత్తం తిరిగి వారి వేతనాల్లో నుంచి రికవరీ చేయించుకొనే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి, కాంతారావు, ఖాదీ గ్రామోద్యోగ్ సిబ్బంది ఉన్నారు.



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న జీఎం శ్రీనివాస్

బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులందరూ కంపెనీ కల్పిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వంటి బ్యాంకులతో ఈ ప్రమాద బీమా ఒప్పందం చేస్తుందన్నారు. త్వరగా అకౌంట్లు తెరవాలని కార్మికులకు సూచించారు.

నేడు బతుకమ్మ సంబరాలు

- కల్వకుంట్ల కవిత హాజరు
- ప్రగతి మైదానంలో విస్తృత ఏర్పాట్లు

శ్రీరాంపూర్: ఏరియాలోని ప్రగతి మైదానంలో మంగళవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు జరగనున్నాయి. హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంబరాల కోసం విస్తృ త ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారు. బతుకమ్మ కార్యక్రమాన్ని సక్సెస్ చేసి తన సత్తా ఏంటో చాటాలనే కృత నిశ్చయంతో ఆమె ఉన్నారని తెలిసింది. ఇందుకోసం కొద్ది రోజులుగా ఆమె బృందం దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు. హెచ్ఎమ్మెస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు వీ.అనిల్‌రెడ్డి, కార్యదర్శి అశోక్, జాగృతి నాయకులు రత్నాకర్‌రెడ్డి, వెంకట్, ఐత ప్రశాంత్, మున్నా, ఈట రాకేశ్, మానిక్ ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఎమ్మెల్సీ కవిత సీసీసీలోని కార్మికుడు, యూనియన్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పేర్చుతారు.

వాస్తవ లాభాల నుంచి వాటా చెల్లించాలి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాల్లో నుంచి కొత్త గనుల కోసమని రూ.4,034కోట్లు పక్కన పెట్టి ఉద్యోగులకు వాటా పంపిణీ చేయడం శోచనీయమని హెచ్ఎమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చిన వాస్తవ లాభాల నుంచి వాటా పంపిణీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పీఎల్ఆర్ బోనస్ సమావేశం వాయిదా

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు ఏటా చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డు(పీఎల్ఆర్)పై సోమవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడినట్లు బీఎంఎస్ నేతలు తెలిపారు. కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు సమావేశం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వాయిదా పడిందన్నారు.



వేమనపల్లిలో...



తాండూర్: మాదారంలో...



పోలీస్ బెటాలియన్‌లో దుర్గాదేవికి పూజలు



జైపూర్ ఎస్టీ కాలనీలో...



మంచిర్యాలఅర్బన్: పూజల్లో భవానీ దీక్షాపరులు



చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో...

కొలువుదీరిన దుర్గాదేవి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు

లక్సెట్టిపేట/జైపూర్/మంచిర్యాలఅర్బన్/వేమనపల్లి/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/నస్పూర్/తాండూర్/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు మండపాలను అందంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ పి.వెంకటరాములు, మందమర్రిలో జీఎం దంపతులు రాధాకృష్ణ–శ్రీవాణి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు